www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 11 | సెప్టెంబర్ | 2026


## నేటి నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

**-17న హైదరాబాద్‌లో బహిరంగ సభ**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** 78వ సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుంచి 16 వరకు ఖమ్మం జిల్లాలో నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు సురేష్ తెలిపారు. ఈనెల 11న ఉదయం నల్లమల గిరిప్రసాద్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించడంతో వారోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 12న చింతకాని మండలం ప్రొద్దుటూరు, బోనకల్ మండలం గోవిందాపురం గ్రామాల్లో సాయుధ పోరాట వారోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. 13న ఎం. వెంకటాయపాలెం, గోకినేపల్లి, నేలకొండపల్లి గ్రామాల్లో, 15న రఘునాథపాలెం మండలం పాపటపల్లి గ్రామంలో, 16న తనికెళ్ల, ఏన్కూరు మండలం మేడేపల్లి, సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామాల్లో సాయుధ పోరాట వారోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తామని సురేష్ తెలిపారు. 17న సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సురేష్ తెలిపారు.

# మధిర మెప్మాలో.. వసూళ్ల పర్వం..!



**-ఇదేమంటే బెదిరింపులు**
**-పేదరిక నిర్మూలన స్థానే రాజ్యమేలుతున్న అవినీతి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మధిర మెప్మాలో వసూళ్ల పర్వం యథేచ్ఛగా కొనసాగుతుంది. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన సంగతి ఏమో కానీ మెప్మాలో పనిచేస్తున్న వారి ఆర్థిక అవసరాలు మాత్రం చకచకా నెరవేరుతూ ఉద్యోగుల ఆర్థిక వృద్ధి నిరంతరాయంగా కొనసాగుతుంది. మెప్మా పరిధిలో స్వయం సహాయక బృందాలకు రుణాలు అందాలంటే చేతులు తడపాల్సిన పరిస్థితి. ఎంతో కొంత లంచం

మిగతా 2లో..

## ప్రారంభం కాకుండానే..
# శిథిలావస్థకు..!

**-ఉప ముఖ్యమంత్రి ఇలాకాలో ఎక్సైజ్ స్టేషన్ దుస్థితి**




**ప్రజాపక్షం/మధిర:** ఎక్సైజ్ కార్యాలయం ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్న స్థితి ఇది. ఎక్కడో మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోనూ మరో చోటో అనుకుంటే పొరపాటే. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర కేంద్రంలో ఈ స్థితి నెలకొన్నది. అంతే కాదు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయానికి కూత వేటు దూరంలో ఈ ఎక్సైజ్ కార్యాలయ నిర్మాణం

మిగతా 2లో..

# భూ రీ సర్వేతో భూ వివాదాలకు చెక్



**-రైతు సమక్షంలో భూమి హద్దుల నిర్ధారణ**
**-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ప్రజాపక్షం/మధిర :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వే ద్వారా రైతుల భూములపై ఉన్న వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డుల్లోని లోపాలను ఎవరికి అన్యాయం జరగకుండా పారదర్శకంగా భూ సమస్యలు పరిష్కారం కావాల్సింది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. మధిర నియోజకవర్గంలో గురువారం జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మధిర మండలం తొండల గోపవరం గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో పంట పొలాల్లో నడుచుకుంటూ వెళ్లి రైతుల సమక్షంలో నిర్వహిస్తున్న రీ సర్వేను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులతో కలెక్టర్ నేరుగా ముచ్చటించి సర్వేపై వారి అభిప్రాయాలను తెలుసుకొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలో పలు రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో భూ సర్వే కొనసాగుతుందని కలెక్టర్ వివరించారు. ప్రతి మనిషికి ఆధార్ లాగా ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానంతో చేస్తున్న భూ సర్వే ద్వారా ప్రతి రైతు భూమికి డిజిటల్ మ్యాప్‌తో కూడిన భూధార్ కార్డు ఉంటుందని తెలిపారు. గ్రామంలో గతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేకోవడం, ఆన్‌లైన్ ప్రక్రియలో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి భూమిపై ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండడం వంటి అనేక సమస్యలు రైతులు ఎదుర్కొంటున్న వారికి, అలాగే ఉన్న భూ విస్తీర్ణం కొంతమందికి తక్కువగా నమోదు కాగా, మరి కొందరికి ఎక్కువగా నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయని, రీ సర్వే ద్వారా అలాంటి అన్ని లోపాలను సరిచేస్తామని చెప్పారు. గ్రామంలోని ప్రతి రైతుకు ముందుగానే నోటీసులు జారీ చేసి, రైతుల సంక్షంలోనే వారి పొలాలను కలుస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులు స్వయంగా తమ భూమి హద్దులను

మిగతా 2లో..

# భార్యను చంపిన భర్త



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మంలో దారుణ ఘటన వెలుగుచూసింది. భార్యపై అనుమానంతో భర్త హత్య చేసి పరారయ్యేందుకు యత్నించి పోలీసులకు పట్టుబడ్డాడు. ఖానాపురం పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లెందుకు చెందిన మేడిపల్లి విద్యాసాగర్ కారు డ్రైవర్‌గా పని చేస్తూ ఖమ్మం సిసిఎస్ పోలీసు స్టేషన్ సమీపంలో నివసిస్తున్నాడు. కుటుంబ కలహాలతో మొదటి భార్యతో విడాకులు తీసుకుని ఆ తరువాత తనకు పరిచయం ఉన్న చిన్నబోయిన రేణుక (40) అనే మహిళను ఇటీవల రెండో వివాహం చేసుకుని ఆమెతో కలిసి ఉంటున్నాడు. అయితే ఆమెతీరులో మార్పు రావడంతో రేణుకపై అనుమానం పెంచుకున్నాడు విద్యాసాగర్. ఆమెకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో తరచూ ఆమెను వేధించడం మొదలు పెట్టాడు. దీంతో ఇరువురి మధ్యం కలహాలు మొదలైయ్యాయి. ఈనేపథ్యంలో బుధవారం సాయంత్రం రేణుకతో కలిసి కారులో ఇద్దరు బయటకు వెళ్లారు. ప్రయణించే సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగటంతో ఆవేశంలో విద్యాసాగార్ రేణుకను గొంతునులిమి హత్యచేశాడు. ఈవిషయం ఇల్లెందులో ఉన్న తన స్నేహితుడికి ఫోన్‌ద్వారా తెలియజేశాడు. అనంతరం మృతదేహాన్ని కారులో ఉంచి రఘునాథపాలెం, వైఎస్ఆర్ నగర్ మధ్య బైపాస్ ప్రాంతంలో వదిలి పరారైయ్యాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పంచనామ అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించాడు. నిందితుడి కోసం గాలించగా అతని ఫోన్ కాల్‌డేటా, సిగ్నాల్స్ ఆధారంగా రఘునాథపాలెం సమీపంలో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఖానాపురం స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మధిర మెప్మాలో వసూళ్ల పర్వం..!

(మొదటిపేజీ తరువాయి)
ఇస్తే తప్ప రుణం మంజూరు కావడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతుంది. ఉన్నతాధికారులు మాత్రం మెప్మా రుణాల మంజూరుకు ఏ ఒక్కరూ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని అర్హత ఉన్నవారికి తప్పనిసరిగా రుణాలు అందించాల్సిన బాధ్యత రిసోర్స్‌పర్సన్లదే అని చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం తద్విరుద్ధంగా ఉంది. కొందరు ఆర్‌పిలు నేరుగా లబ్ధిదారుల నుంచి నగదు పుచ్చుకుంటున్నారు. మరి కొందరు ఫోన్ పే ద్వారా చెల్లింపులు చేసుకుంటున్నారు. కొందరైతే కుటుంబ సభ్యుల సెల్‌ఫోన్లను వినియోగిస్తున్నారు. ఇందులో కొందరు ఉన్నతాధికారులకు సైతం వాటాలు ఇస్తున్నామన్న ప్రచారం జోరుగా సాగుతుంది. మధిర మెప్మాకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఈ మెప్మాకు సంబంధించి అవినీతి వ్యవహారం ఒక మధిరకే పరిమితం కాలేదని జిల్లా మొత్తం ఇదేవిధంగా కొనసాగుతుందన్న ప్రచారం ఉంది. ఎక్కడైనా రుణం పొందాలంటే ముందుగా ఆర్‌పిలను ప్రసన్నం చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇందులో కొందరు రుణం మంజూరైన తర్వాత ఇచ్చింది పుచ్చుకుంటుండగా మరికొందరు డిమాండ్ చేస్తున్నారు. దీనితో రుణం పొందిన ఆనందం లబ్ధిదారుల్లో ఉండడం లేదు. ఈ విషయమై విచారణ జరపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# భూ రీ సర్వేతో భూ వివాదాలకు చెక్

(మొదటిపేజీ తరువాయి)
చూపిస్తారని, ఇరువైపులా పక్కనే ఉన్న రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. భూ సర్వేకు నోటీసు ఇచ్చిన రైతులు వారి కుటుంబంలో భూ హక్కుదారులు, పట్టా పాస్ బుక్‌లో భూమి ఉన్న వారు అందరూ తప్పకుండా సర్వే వచ్చి పూర్తి వివరాలు తెలియజేసి సర్వేకు సహకరించాలని కలెక్టర్ కోరారు. సర్వే పూర్తయ్యాక ఎంత విస్తీర్ణం నమోదైందో రైతులకు అక్కడిక్కడే తెలియజేస్తామని చెప్పారు. రైతులకు సందేహం ఉన్న మరొక్కసారి, రైతులు విశ్వసించే వరకు పారదర్శకంగా భూ రీ సర్వే చేసి వారితో స్వయంగా ఉన్న భూమి విస్తీర్ణానికి సంతకం కూడా తీసుకుంటామని పేర్కొన్నారు. భూ రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్రస్థాయిలో భూ హక్కుదారిని సమక్షంలో జరుగుతుందని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారన్ని నమ్మకంతో భూ రీ సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర భూ రికార్డులు సర్వే అధికారులకు అందజేయడంతో పాటు క్షేత్రస్థాయిలో భూమి వాస్తవ హద్దులను చూపించి సహకరించాలని కలెక్టర్ కోరారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి వివరాలను గ్రామపంచాయతీ, తహశీల్దార్ కార్యాలయాల్లో నోటీస్ బోర్డులో ఉంచుతామని, ఎలాంటి అభ్యంతరాలకు గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూదార్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఈ సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట మధిర తహశీల్దార్ రాంబాబు, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంబిబిఎస్ సీటు సాధించిన లావణ్యకు ఘన సన్మానం

### పేద విద్యార్థులకు అండగా కౌన్సిలర్ ఫణితి సైదులు



ప్రజాపక్షం/వైరా: పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబిబిఎస్ సీటు సాధించడాన్ని అభినందిస్తూ వైరా మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు ఆర్థిక సహాయం అందించారు. వైరా మున్సిపాలిటీ 7వ వార్డు బ్రాహ్మణపల్లికి చెందిన పంతగాని లావణ్య ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో 1700 ర్యాంకు సాధించింది. దీంతో ఎంబిబిఎస్ సీటు పొందించి. లావణ్యకు తండ్రి లేకపోవడతో ఆమె తల్లి ఎంతో కష్టపడి కుటుంబాన్ని పోషిస్తూ కుమార్తెను చదివించారు. లావణ్య విజయాన్ని తెలుసుకున్న కౌన్సిలర్ ఫణితి సైదులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా లావణ్యకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ ఫణితి సైదులు మాట్లాడుతూ సాధారణ కుటుంబానికి చెందిన లావణ్య చిన్ననాటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంబిబిఎస్ సీటు సాధించడం అభినందనీయమని అన్నారు. లావణ్య తల్లిని ప్రతేయకంగా అభినందించారు. 7వ వార్డు బ్రాహ్మణపల్లికి చెందిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించినప్పుడు తల్లిదండ్రులకు కలిగే ఆనందం ఎంతో గొప్పదని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల చదువకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తానని ఫణితి సైదులు తెలిపారు. ఈకార్యక్రమంలో పోటు మధు, చెరుకూరి శ్రీను, దారా వెంకన్న, బీరెల్లి గురవయ్య, అక్బర్, ఫణితి నాగార్జున, ఫణితి సుందర్‌రావు, కాండ్ర రాము, బీరెల్లి రామారావు, అరవింద్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు..!






### బ్రెయిన్ ట్యూమర్ సర్జరీకి రూ.10-15 లక్షలు

ప్రజాపక్షం/సత్తుపల్లి: బ్రెయిన్ ట్యూమర్‌తో తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తల్లిని కాపాడుకునేందుకు ఓ నిరుపేద కుటుంబం దాతల సహాయం కోసం ఎదురుచూస్తోంది. సత్తుపల్లి పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన షేక్ బేగం పది రోజుల క్రితం బ్రెయిన్ ట్యూమర్‌కు గురయ్యారు. ప్రస్తుతం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు వీలైనంత త్వరగా శస్త్రచికిత్స చేయాలని, ఆలస్యం చేస్తే ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉందని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యుల సూచన మేరకు సర్జరీతో పాటు తదుపరి వైద్య చికిత్సలకు సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికే వైద్య ఖర్చుల కోసం సుమారు రూ. 2 లక్షలు వెచ్చించినట్లు పేర్కొన్నారు. షేక్ బేగం కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉంది. ఆమె కుమారుడు షేక్ రెహమాన్ డిష్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన రెహమాన్ ప్రస్తుతం తల్లికి వచ్చిన ప్రాణాంతక వ్యాధి చికిత్స కోసం పెద్ద మొత్తంలో డబ్బు అవసరం కావడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తల్లి ప్రాణాలను కాపాడుకునేందుకు తనకు చేతనైనంత ప్రయత్నం చేస్తున్నానని, అయితే సర్జరీకి అవసరమైన భారీ మొత్తాన్ని ఒంటరిగా సమకూర్చుకోలేని పరిస్థితిలో ఉన్నానని రెహమాన్ ఆవేదన వ్యక్తం చేశారు. దయగల దాతలు, మానవతావాదులు తన పరిస్థితిని అర్థం చేసుకుని తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి తన తల్లి ప్రాణాలను కాపాడేందుకు అండగా నిలవాలని ఆయన వేడుకున్నారు. చిన్న సహాయం కూడా తమ కుటుంబానికి ఎంతో విలువైనదని, దాతలు అందించే ప్రతి రూపాయి తన తల్లి చికిత్సకు ఉపయోగపడుతుందని రెహమాన్ తెలిపారు. ఆర్థిక సహాయం అందించేందుకు పేరు: షేక్ రెహమాన్ ఫోన్‌పే: 97017 07178దాతలు తమకు తోచినంత సహాయం అందించి షేక్ బేగం ప్రాణాలను కాపాడేందుకు సహకరించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు..!

(మొదటిపేజీ తరువాయి) జరుగుతుండటం గమనార్హం. మధిర నియోజక వర్గానికి నిధుల వరద పారుతుందని రహదారులు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం త్వరితగతిన సాగుతుందన్న ప్రచారం నేపథ్యంలో ఎక్సైజ్ కార్యాలయం గురించి పట్టించుకోకపోవడం శోచనీయం. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా ప్రజలు అడిగిందే తరువాయి మంజూరై పనులు చేపడుతున్న పరిస్థితుల్లో దశాబ్ద కాలంగా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను పట్టించుకోక పోవడం ఇప్పుడు చర్చనీయాంశం అవుతుంది. సరిగ్గా పదేళ్ల క్రితం ఎక్సైజ్ కార్యాలయం నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్మాణాన్ని ప్రారంభించి దాదాపు 60 శాతం పనులను పూర్తి చేశారు. నిధుల లేమితో మిగిలిన పనులు నిలిచిపోయాయి. ఎక్సైజ్ అధికారులతో పాటు స్థానికులు ఈ కార్యాలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తిచేశారు. కానీ ఇంత వరకు నిధులు మంజూరు కాలేదు. మధిర ప్రాంతం తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దున ఉండడంతో ఎక్సైజ్ శాఖకు ఈ ప్రాంతం చాలా కీలకమైంది. ఇక్కడ కార్యాలయం లేక అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న ఈ కార్యాలయం క్రమేపి శిథిలావస్థకు చేరుకుంటుంది. చెట్లు మొలిచి అడవిని తలపించే రీతిలో కార్యాలయ ఆవరణ ఉంది. ఇప్పటికైనా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చొరవ చేసి ఈ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## నిరుపేదలకు వీల్ చైర్ పంపిణీ




ప్రజాపక్షం/ తల్లాడ : సమాజంలో నిరుపేదలకు సేవ చేసేందుకే ఇశ్రాయేలు చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసినట్లు ఇశ్రాయేలు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు బ్రదర్ ఖమ్మంపాటి ఇజ్రాయిల్ తెలిపారు. గురువారం వైరా నారపునేనిపల్లికి చెందిన నిరుపేద వృద్ధురాలు దుగ్గిరాల రాములయ్యకు సంస్థ ఆధ్వర్యంలో వీల్‌చైర్, దోమతెరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను గుర్తించి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టి పేద వర్గాలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోనా, లక్ష్మ య్య, రంగమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి




ప్రజాపక్షం/ తల్లాడ : వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, మండల నాయకుల ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మ గౌరవానికి, ధైర్యానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీకగా వీరనారి చాకలి ఐలమ్మ నిలిచారన్నారు. నిజాం పాలనలో భూసామ్య, దోపిడీ, వెట్టిచాకిరి, పేద రైతులపై జరుగుతున్న అణిచివేతకు వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో దిరిశాల నర్సింహారావు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, మాజీ విడిసి ఛైర్మన్ మారెళ్ల మల్లికార్జునరావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మలపల్లి రమేష్, జోసఫ్, వెంకటనారాయణ రెడ్డి, వెంకటేశ్వరరావు, కార్యకర్తలు, మండల నాయకులు పాల్గొన్నారు.

## ఏఐసిసిలో బిపీ నాయక్‌కు కీలక బాధ్యతలు

### -పరిశ్రమల విభాగం, ఉమ్మడి ఖమ్మం జిల్లా బాధ్యతలు అప్పగింత



ప్రజాపక్షం/బోనకల్: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసిసి) ప్రొఫెషనల్ కాంగ్రెస్‌లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బిపీ నాయక్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. పరిశ్రమల విభాగం బాధ్యతలతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా బాధ్యతలు అప్పగించారు. పరిశ్రమల విభాగం బాధ్యతలతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా బాధ్యతలను ఆయనకు కేటాయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పరిశ్రమల సమస్యలను అధ్యయనం చేసి పాలసీ పరమైన సూచనలు అందించే కమిటీ బాధ్యతలను కూడా అప్పగించినట్లు పేర్కొన్నారు. ఐటీ ఆర్కిటెక్ట్, ఐటీ స్పెషలిస్టుగా పనిచేస్తున్న బిపీ నాయక్ ఈశ్రమ్ ఐటిఎస్‌లో సీఈఓగా సేవలందిస్తున్నారు. సాంకేతిక రంగంలో అనుభవంతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల సమస్యలపై అవగాహన ఉన్న నాయకుడిగా ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. 2023 ఎన్నికల్లో వైరా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన ఆయన అనంతరం ప్రజా సమస్యలపై పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిపి నాయక్ కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించడంపై ఖమ్మం జిల్లా కాంగ్రెస్ శ్రేణులు, బోనకల్ మండల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## చిన్నారులకు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత చిన్నపిల్లల గుండె వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. తెలంగాణ వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం, హైదరాబాద్ అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ సంయుక్త సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 0 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల 62 మంది చిన్నారులకు ప్రముఖ పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు, కార్డియోథొరాసిక్ సర్జన్లు వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో ఖమ్మం జిల్లాకు చెందిన 61 మంది, మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఒకరు ఉన్నారు. శిబిరంలో అపోలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుజాతా పాటిల్, డాక్టర్ సునీల్‌కుమార్ స్వైన్, డాక్టర్ అనుపమ పాటేల్‌తో పాటు ఖమ్మం జిజిహెచ్ మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ నరేందర్, పీడియాట్రిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ బాబు రత్నాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి లక్ష్మీనారాయణ, ఆర్‌బిఎస్‌కె నోడల్ అధికారి డాక్టర్ శ్రీకాంత్ తదితర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి




**-గోదాముల స్థలాలను ముందుగానే గుర్తించాలి**
**-ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించిన అదనపు కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులు ధాన్యం రవాణా కాంట్రాక్టర్లు, గోదాముల నిర్వాహకులతో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్‌లో సుమారు 2.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అందుకు తగినట్లుగా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసి అక్టోబర్ ఒకటి నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. రైతులు ధాన్యాన్ని శుభ్రపరిచి నిర్దేశిత తేమ శాతంతోనే కేంద్రాలకు తెచ్చేలా రైతు వేదికలు ఏఈవోల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక పంచాయతీ సిబ్బందిని కేటాయించాలని, కేంద్రాల ఇంచార్జ్‌లకు నాణ్యతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణపై సమగ్ర శిక్షణ అందించాలన్నారు. కేంద్రాల్లోని మౌలిక సదుపాయాల వివరాలను ఫోటోలతో సహా ప్రత్యేక యాప్‌లో అక్టోబర్ 10లోగా నమోదు చేయాలని నిబంధనలు పాటించని కేంద్రాలకు కమిషన్ నిలిపి వేస్తామన్నారు. ఏగ్రేడ్ ధాన్యానికి క్వింటా రూ. 2461, సాధారణ రకానికి రూ. 2441 మద్దతు ధర లభిస్తుందన్నారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న రకాలైన బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటి సోన, జై శ్రీరామ్, సెగ్మెంట్, కెఎన్ఎం 1638, డబ్ల్యూజిఎల్ 44, కెఎన్ఎం 7715 రకాల ఏగ్రేడ్ ధాన్యానికి మాత్రమే క్వింటాకు రూ. 500 బోనస్ చెల్లిస్తామని ఇందుకు గాను కేంద్రాల్లో ఏడు రకాల నమూనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం నిల్వలకు సరిపడ గోదాములను సిద్ధం చేయాలని, రవాణా వాహనాలకు తప్పనిసరిగా జిపిఎస్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఏఎస్‌వో మల్లికార్జునబాబు, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, డిసివో గంగాధర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

**-ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్, అదనపు కలెక్టర్**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లు అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని ధంసలాపురం చెరువు వద్ద నిమజ్జనానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులతో కలిసి కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక విగ్రహాలను తీసుకు వచ్చే వాహనాలకు మార్గ మధ్యలో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాలు చెరువు వద్దకు రావడానికి, నిమజ్జనం అనంతరం తిరిగి వెళ్లడానికి ప్రత్యేక మార్గాలను కేటాయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. నిమజ్జన మార్గంలో విద్యుత్ లైన్లు అడ్డం లేకుండా చూడాలని, రాత్రి వేళల్లో సరిపడ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దిష్ట గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. పోలీస్, తహసీల్దార్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం, విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.



# వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలో గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సత్తుపల్లి వేంసూరు రోడ్డులోని ధోబీఘాట్‌లో పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక వివక్ష, దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, రజక సంఘం అధ్యక్షులు విరివాడ నాగభూషణం,రజక సంఘ సభ్యులు వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం నాయకులు పంతంగి మారుతి, సాంబ,చింతల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని పెంపొందించుకోవాలి

**-డాక్టర్ కాపా మురళీకృష్ణ**
**-వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థినిక సైకిల్ పంపిణీ**





**ప్రజాపక్షం/వైరా:** ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకొని సమాజ సేవకు పాటుపడాలని లయన్స్‌క్లబ్ పాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. వైరా గ్రేట్ విజన్ క్లబ్ లయన్స్‌క్లబ్ ఆఫ్ అవని సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా జిఈటి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్ బాబు వరలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా గురువారం వైరా మున్సిపాలిటీ 20వ వార్డులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు రమ అనే విద్యార్థినికి సైకిల్‌ను అందజేశారు. అనంతరం వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి శ్యామ్‌బాబు వరలక్ష్మి దంపతులకు క్లబ్ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి లయన్ మెంబర్ తన సంపాదనలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు. వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన శ్యామ్‌బాబు, వరలక్ష్మి దంపతులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎల్‌సిఐఎఫ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్‌రావు, జోన్ చైర్మన్ తోటకూర శ్రీకాంత్,జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేంద్రరావు, రీజియన్ సెక్రటరీ వై.బుచ్చిరామారావు, గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షుడు ఉయ్యూరు రామకృష్ణ, కార్యదర్శి మచ్చా రామారావు, అవని క్లబ్ అధ్యక్షురాలు గద్దె నీరజ, కార్యదర్శిసుగ్గల మాధవి, సభ్యులు పోలా శ్రీనివాసరావు, నాళ్ల నాగమల్లేశ్వరి, రాయల విజయలక్ష్మి , పొదిలి కల్పన, సునీత, శైలజ, పువ్వాళ్ళ రాము, బీక్యా తదితరులు, క్లబ్ సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి



**ప్రజాపక్షం/చింతకాని :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమం చింతకాని మండల సిపిఐ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి దూసరి గోపాలరావు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ భూస్వామ్య ,దొరల దోపిడీకి వ్యతిరేకంగా పేదలు , రైతులు , కూలీల హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమన్నారు. మహిళగా ఎన్నో అవమానాలు, అణిచివేతలు ఎదుర్కొంటునే భయపడకుండా దొరల పెత్తనాన్ని ఎదిరించి ప్రజలపక్షాన నిలిచిన ధీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. నేడు రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లి దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బస్వాపురం సర్పంచ్ ఆవుల నర్సింహారావు, సాయి, సిద్ది సాయిబ్, శంకర్‌రావు, ప్రసాద్, వెంకట్ , కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



**ప్రజాపక్షం/చింతకాని :** రాఘవాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం ఉపసర్పంచ్ అబ్బూరి మహేష్ స్కూల్ యూనిఫాం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నకేశవరెడ్డి, ఉపాధ్యాయులు,పంచాయతీ కార్యదర్శి సురేష్ వార్డు సభ్యులు దొబ్బల నర్సింహారావు, నిరూష, అంగన్‌వాడీ కార్యకర్త సీహెచ్ కనకమ్మ, వీవోఏ ధర్మపురి ధనలక్ష్మీ , దొబ్బల సుజాత, దొబ్బల నిర్మల, సావిత్రి, మంగతాయి పాల్గొన్నారు.

# బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలి




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేసి స్థానిక యువతకు పెద్ద ఎత్తున్న ఉపాధి అవకాశాలు కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య ఖమ్మం జిల్లా అధ్యక్షులు, 32వ వార్డు సిపిఐ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలో జరుగుతున్న అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో ఆయన ఈమేరకు గురువారం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాలకు చెందిన వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పరిశ్రమ ఏర్పాటులో స్థానిక గిరిజనుల హక్కులను పరిరక్షించడంతో పాటు పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక గిరిజనుల హక్కులను కాపాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని మహాసభ సైతం డిమాండ్ చేసింది.

# గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందివ్వాలి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** గర్భిణీలు, బాలింతలకు బలమైన పోషకాహారాలు అందించాలని కాంగ్రెస్ సర్పంచ్ బండి సతీష్ అన్నారు. గురువారం ఆరెంపుల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గర్భిణీలకు బలమైన ఆహారం అందించడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే బాలింతలకు బలం అందడంతో పాటు పిల్లలకు తల్లిపాలు మంచిగా అందుతాయన్నారు. కావున అంగన్వాడీలు ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం, ఎగ్స్, పోషకాహారం విధిగా అందించాలని సూచించారు. అదేవిధంగా ఏదులాపురంమున్సిపాలిటీలోని 9వ వార్డులో నిర్వహించిన వేడుకలకు కౌన్సిలర్ కందుకపూరి శేషమ్మ హాజరయ్యి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దావూద్, సూపర్‌వైజర్లు మాలతి, ఆర్ పుష్పలత, హెచ్ఎం నాగులుమీరా, ఏఎన్ఎం నాగమణి, అంగన్వాడీ టీచర్లు సరిత, భాగ్యమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

# తెలంగాణ నిప్పు రవ్వ చాకలి ఐలమ్మ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** తెలంగాణ తొలి సాయుధ పోరాటపు వీరనారి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలను పెనుబల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. గురువారం పెనుబల్లి మండల రజక సంఘం అధ్యక్షులు పంతంగి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వి ఎం బంజర్ అంబేద్కర్ సెంటర్లోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1895లో వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిరుపేద కుటుంబంలో ఐలమ్మ జన్మించింది. ఆమె వృత్తే ఇంటిపేరుగా మారింది ఆనాటి నుండే చాకలి ఐలమ్మగా పేరుగాంచింది. తెలంగాణలో దేశ్ ముఖ్ లు, భూస్వాములు, జమీందారులు జాగిర్దారులు, పటేల్, పట్వారి వ్యవస్థ తోపాటు వారి దౌర్జన్యాలు, దోపిడీలు గ్రామాలలో కొనసాగుతుండేవి. ఇక్కడే చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటపు తొలి వీరనారిగా మారింది. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పంతంగి వెంకటేశ్వరరావు, భోగి మోహన్ రావు, కావిటి శ్రీను, రాజకీయ పార్టీ నాయకులు పంది వెంకటేశ్వర్‌రావు, చలమాల విఠల్రావు, వియం బంజర సర్పంచ్ బుక్య ప్రసాద్, పెనుబల్లి సర్పంచ్ బానోతు పాప,మేకతొట్టి కాంతయ్య, గాయం తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐకేఎంఎస్ మహాసభలను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మంలో ఈనెల 28న జరిగే భారీ బహిరంగ సభ, 29,30తేదీల్లో నిర్వహించే అఖిల భారత కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)నాలుగో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ పిలుపునిచ్చారు. కారేపల్లి మండలం మాదారంలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు, కార్మిక వ్యతిరేక విధానాలతో వ్యవసాయం రంగం సంక్షోభంలోకి నెట్టబడిందని ప్రకాష్ ఆరోపించారు. రైతుల వ్యతిరేక చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌లు, విద్యుత్ బిల్లు రద్దు, పంటలకు గిట్టుబాటు ధర, స్వామి నాథన్ సిఫారసుల అమలు, కనీస వేతన చట్టం కోసం పోరాటాలను ముందుకు తీసుకెళ్లేందుకు మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రైతులు, కూలీలు, కార్మికులు, విద్యార్థులు, మేధావులు వేలాదిగా పాల్గొని సభలు, మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోయిల శ్రీనివాస్, నాగేశ్వరరావు, గడ్డం వెంకన్న, నరేష్, నరసింహారావు, రమేష్, పాల్గొన్నారు.

## డాక్టర్ బాషిపంగు వెంకన్నకు పీహెచ్‌డీ పట్టా



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి ఎంజేపీ బాలుర పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న డాక్టర్ బాషిపంగు వెంకన్న ఉస్మానియా విశ్వ విద్యాలయం 85వ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. తెలంగాణ కథ సాహిత్యంపై తెలంగాణ కథా సాహిత్యం, ప్రాదేశిక వ్యక్తీకరణ అంశంలో పరిశోధన పూర్తి చేశారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె ములగారం కుమార్, భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ కృష్ణ, ఎం ఎల్లా చేతుల మీదుగా వెంకన్న పట్టా స్వీకరించారు. ఆయన పరిశోధనకు డాక్టర్ దాశరథుల నరసయ్య పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. వెంకన్నను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింద కాశిం, ఎంజేపీ కూసుమంచి ప్రిన్సిపాల్ పెరబోయిన మల్లయ్య, కుటుంబ సభ్యులు, సాహితీ వేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, స్టూడెంట్స్ యూనియన్ ప్రతినిధులు అభినందించారు.

## ఇల్లందులో జనసేన శంఖారావం సభకు పిలుపు

**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు నియోజకవర్గంలో నిర్వహించనున్న జనసేన శంఖారావం సభను విజయవంతం చేయాలని జనసేన ఇల్లందు పట్టణ అధ్యక్షుడు మద్ది సాయికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా జనసైనికులు, వీర మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలపై విశ్వాసంతో పార్టీలో చేరాలనుకునే యువతకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. సభకు హాజరయ్యే వారికి వాహన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యల కోసం జనసేన శక్తిని చాటేందుకు తరలిరావాలని కోరారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన ధీరవనిత, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు పాపకొల్లు గ్రామ పంచాయతీలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాటి రజాకారులు, భూస్వాముల దోపిడీకి ఎదురొడ్డి, పేదలు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, తెగువ తెలంగాణ సమాజానికి ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఆత్మగౌరవం, సమానత్వం కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరంతో పాటు భావితరాలకు కూడా స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ త్యాగాలను స్మరించుకుంటూ ఆమెకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చాపలమడుగు రాంమూర్తి, మూడు చిట్టిబాబు (మాజీ ఎంపీపీ), తాళ్లూరి రామారావు, తాళ్లూరి వెంకటేశ్వర్లు, ఇల్లంగి తిరుపతి, నిమ్మటూరి కనకయ్య (మాజీ ఉప సర్పంచ్), రామిశెట్టి వంశీ, ధర్మరాజుల పుల్లయ్య, వాంకుడోత్ బాబులాల్, మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు రజక సంఘం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు, అశ్వాపురం మండలాల్లో ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్ల తనిఖీలు

**ప్రజాపక్షం/మణుగూరు:** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని మణుగూరు, అశ్వాపురం మండలాల్లో పలు ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డయాగ్నొస్టిక్ సెంటర్లలో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లు, ఇతర సంబంధిత పత్రాలను అధికారులు పరిశీలించారు. అలాగే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ ను సంబంధించిన అనుమతులు, రిజిస్ట్రేషన్ పత్రాలు మరియు నిబంధనల అమలును తనిఖీ చేశారు. తనిఖీలలో గుర్తించిన లోపాలను సంబంధిత నిర్వాహకులకు తెలియజేసి, నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోపాలు గుర్తించిన డయాగ్నొస్టిక్ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. తనిఖీలకు సంబంధించిన సమగ్ర నివేదికను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారికి సమర్పించారు.ఈ తనిఖీల కార్యక్రమంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాందాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో సిబ్బంది కొరత..!

**-35 మంది ఉండాల్సిన చోట 13 మందితోనే పాలన**
**-20 వార్డులకు నలుగురే వార్డు అధికారులు**
**-కీలక శాఖల్లోనూ ఖాళీలే..**
**-పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లు, పట్టణ ప్రణాళికపై తీవ్ర ప్రభావం**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీగా ఏర్పడి 8 ఏళ్లు దాటినా వైరా పట్టణానికి సిబ్బంది కొరత మాత్రం తీరడం లేదు. పట్టణ జనాభా విస్తీర్ణం, నిర్మాణాలు, వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతున్నా అందుకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది నియామకం జరగడం లేదు. ఫలితంగా 35 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండాల్సిన మున్సిపాలిటీలో ప్రస్తుతం 13 మందితోనే రెగ్యులర్ పాలన సాగుతుంది. 2018 ఆగస్ట్2న వైరా మున్సిపాలిటీ ఏర్పడింది. మున్సిపల్ స్థాయిలో పరిపాలన, పారిశుద్ధ్యం, రెవెన్యూ, హెల్త్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాలకు అవసరమైన సిబ్బందిని సమకూర్చాల్సి ఉన్నప్పటికీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మంజూరైన పోస్టుల్లో కూడా అనేక ఖాళీలు ఉండటంతో ఉన్న సిబ్బందిపైనే అదనపు బాధ్యతలు పడుతున్నాయి.

### 35 పోస్టులు...13 మందే

మున్సిపాలిటీలో మొత్తం 35 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండాల్సి ఉండగా 16 మందికి నియామకాలు జరిగాయి. వీరిలో ఆరుగురు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. మరో ముగ్గురు డిర్యూటేషన్‌పై వైరాకు వచ్చారు. దీంతో ప్రస్తుతం 13 మంది రెగ్యులర్ ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. రోజువారి పరిపాలన నుంచి ప్రజల ఫిర్యాదుల పరిష్కారం వరకు, పన్నుల వసూళ్ల నుంచి రికార్డుల నిర్వహణ వరకు అనేక పనులను ఇదే సిబ్బంది నిర్వహించాల్సి వస్తుంది.

### 20 వార్డులు...నలుగురు వార్డు అధికారులు!

వైరా మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి. ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో ఉండేలా క్షేత్రస్థాయి పర్యవేక్షణ అవసరం. కాని ప్రస్తుతం కేవలం నలుగురు వార్డు అధికారులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఒక్కో అధికారిపై పలు వార్డుల బాధ్యతలు పడుతున్నాయి. వార్డుల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, పన్నులు, ప్రజా ఫిర్యాదులు, ఇతర మున్సిపల్ అంశాలపై నిరంతర పర్యవేక్షణకు ఇది అడ్డంకిగా మారుతుంది.

### కీలక శాఖల్లో అధికారుల కొరత

మున్సిపాలిటీలో శానిటేషన్, రెవెన్యూ, హెల్త్ మేనేజర్ వంటి కీలక విభాగాల్లో పూర్తిస్థాయి అధికారులు లేకపోవడం మరో సమస్యగా మారింది. ఏఈ, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో కూడా శాశ్వత అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి డిప్యూటేషన్, ఎఫ్ఏసి బాధ్యతలతో అధికారులు సేవలు అందిస్తున్నారు. శాశ్వత అధికారులు లేకపోవడంతో పట్టణ ప్రణాళిక, నిర్మాణ అనుమతులు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ వంటి అంశాల్లో జాప్యం జరిగే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు.

### పన్నుల వసూళ్లకు ఆటంకమే

మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరులైన ఆస్తి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్లతో పాటు రికార్డుల నిర్వహణ, ప్రజలకు సేవలందించడం కూడా పరిమిత సిబ్బందిపైనే ఆధారపడి ఉంది. దీంతో ఆదాయ వసూళ్ల ప్రక్రియపైనా సిబ్బంది కొరత ప్రభావం చూపే అవకాశం ఉంది.

### పట్టణం పెరుగుతుంది...సిబ్బంది పెరగడం లేదు!

మున్సిపాలిటీగా ఏర్పడిన సమయంలో ఉన్న పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం వైరా పట్టణం విస్తరిస్తుంది. కొత్త నివాస ప్రాంతాలు, వాణిజ్య సంస్థలు, నిర్మాణాలు పెరుగుతున్నాయి. కాని వాటికి అనుగుణంగా మున్సిపల్ సిబ్బంది మాత్రం పెరగకపోవడం విమర్శలకు తావిస్తుంది.

### ప్రభుత్వం దృష్టి సారించాలి

పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీచేయాలని , 20 వార్డులకు తగిన సంఖ్యలో వార్డు అధికారులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. శానిటేషన్, రెవెన్యూ, హెల్త్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ తదితర కీలక విభాగాల్లో పూర్తిస్థాయి అధికారులు, సిబ్బందిని నియమించి వైరా మున్సిపాలిటీకి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# అటుపోట్లను తట్టుకుని నిలిచిన వారే నిజమైన కమ్యూనిస్టులు

**- వ్య.కా.సం. అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్**
**- ఘనంగా టివిఆర్ చంద్రం ఎగరేసిన ఎర్రనిజెండా పుస్తకావిష్కరణ**





**ప్రజాపక్షం/భద్రాచలం :** పార్టీ సిద్ధాంతాలకు కడవరకు కట్టుబడి ఆటుపోట్లను ఎదుర్కొని నిలిచిన వారే నిజమైన కమ్యూనిస్టులని వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. స్థానిక కేకే ఫంక్షన్ హాల్లో టివిఆర్ చంద్రం జీవిత చరిత్ర ఆధారంగా ఆయన కుమారుడు జగన్ రచించిన ఎగరేసిన ఎర్రని జెండా పస్తకావిష్కరణ గురువారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ చీలక అనంతరం చంద్రం సిపిఐఎం పక్షాన నిలిచారని చెప్పారు. ఆఖరి వరకు ఆయన నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఎర్రజెండాతోనే ఉన్నారన్నారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారు రవికుమార్ మాట్లాడుతూ ఆదివాసీలు బడుగు బలహీన వర్గాలు వ్యవసాయ కూలీలు కార్మికుల కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల చరిత్రను దాచలేరన్నారు. సిపిఎం జిల్లాకార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కమ్యూనిస్టు అంటేనే త్యాగానికి ప్రతిరూపం అన్నారు. పార్టీ సిద్ధాంతాలు నిర్ణయాలకు కట్టుబడి చంద్రం నిస్వార్థ జీవితాన్ని గడిపారని చెప్పారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గాభివృద్ధిలో కమ్యూనిస్టు ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం అన్నారు. వామ పక్షాలు ఐక్యంగా ఎన్నో విజయాలు సాధించాయని, అమర వీరుల స్ఫూర్తితో ఉద్యమాన్ని మరింత బలోపేతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యలమంచి రవికుమార్ సిపిఎం సీనియర్ నాయకులు చిటూరు వెంకట్రావు ఏజే రమేష్ పోటు రంగారావు ముర్ల రమేష్ ఎంబి నర్సారెడ్డి బ్రహ్మచారి కారం పుల్లయ్య గడ్డం స్వామి సిపిఐ ఏఐటియూసి నాయకులు నరాటి ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమయాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రతిపక్షాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపాల్సిన అసెంబ్లీ సమావేశాల సమయాన్ని అధికార, ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని సీపీఐ నేలకొండపల్లి మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు విమర్శించారు. గురువారం నేలకొండపల్లి మండల కేంద్రం లోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అసెంబ్లీలో నిర్మాణాత్మక చర్చ జరగాల్సి ఉండగా, అధికాప్రతిపక్షాలు పరస్పర విమర్శలు, ఆరోపణలకే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. నిరుద్యోగం, రైతుల సమస్యలు, నిత్యావసరాల ధరల పెరుగుదల, కార్మికుల ఇబ్బందులు, విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలు వంటి ప్రజా సమస్యలపై చర్చించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయాల్సిన బాధ్యత ఉభయ పక్షాలపై ఉందన్నారు. ప్రజల పన్నులతో నడిచే అసెంబ్లీ ప్రతి నిమిషం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకు కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి సమయం కేటాయించాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అసెంబ్లీ చర్చలు సాగాలని వేంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కాశబోయిన అయోధ్య, కుంచం భిక్షం, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**- పీడిత ప్రజల విముక్తి కోసం ఐక్య పోరాటం**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**





**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** వీరనారి చాకలి ఐలమ్మ సాగించిన అసమాన పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని నేటి తరానికి ఆమె ఆదర్శప్రాయురాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా కొత్తగూడెం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన పలు వర్ధతి కార్యక్రమాల్లో ఆయన ముఖ్యాతిథిగా పాల్గొని నివాళ్లర్పించారు. నాటి భూ స్వామ్య పెత్తందారీ దోపిడీ విధానాలపై దేశ్‌ముఖ్ దౌర్జన్యాలపై ఎర్రజెండా అండతో ఎదురొడ్డి నిలిచిన వీర వనిత అన్నారు. తన పంటను కాపాడుకోవడం కోసం ఆమె చేసిన తిరుగుబాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి గొప్ప దిక్సూచిగా మారిందన్నారు. ఆ మహత్తర పోరాట వెట్టచాకిరీ నిజాం నిరంకుశ పాలన బానిస సంకెళ్లను తెంచి పీడిత ప్రజల విముక్తికి బాటలు వేసిందని గుర్తు చేశారు. దోపిడీ అణిచి వేతలపై గర్జించిన నాటి యోధుల ఆశయాల సాధనకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని, నేటికీ పేదలకు సంపూర్ణంగా భూమి ఆవసాం అందకపోవడం దుర్మార్గమని చెప్పారు. పీడిత ప్రజల ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యమని ఐలమ్మ పోరాట స్ఫూర్తితో రాబోయే రోజుల్లో భూ సమస్యలపై రాజీలేని ప్రజా ఉద్యమాలన ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రాలి మురళీ రాచర్ల వెంకటయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

**శేషగిరిభవన్లో :** చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసిన పలువురు నివాళ్లర్పించారు. అనంతరం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య మాట్లాడుతూ బిసి సంఘం జిల్లా నాయకులు నేరెళ్ల రమేష్ మాట్లాడుతూ ఎర్రజెండా అండతో ఐలమ్మ చేసిన పోరాటం అజరామరం అన్నారు. భూమికోసం భుక్తికోసం విముక్తి కోసం ఐలమ్మ నిజాం నిరంకుశత్వాన్ని గర్జించారని చెప్పారు. ఐలమ్మ ఆశయాలను ప్రతీ ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. భూక్య శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రత్నకుమారి రేసు ఎల్లయ్య బోయిన విజయ్‌కుమార్ దుర్గయ్య నల్లా శ్రీనివాస్ కైసర్ గడ్డం సతీష్ రాజు సర్వేశ్వర్ రావు పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణ సాయుధ పోరాట నాయకురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతిని గురువారం మణుగూరులో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా హనుమాన్ టెంపుల్ దగ్గర ఉన్నటువంటి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, భూస్వాములకు వ్యతిరేకంగా, దొరల ఆగడాలకు వ్యతిరేకంగా నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించిన కామ్రేడ్ చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించుకోవాలని భవిష్యత్ తరాలకు వారి స్ఫూర్తిని చాటాలన్నారు. 1895 కిష్టాపురం గ్రామం, వరంగల్ జిల్లా లో జన్మించిన ఆమె అసలు పేరు చిట్యాల ఐలమ్మ, కులవృత్తి చేసుకుంటూ ఐలమ్మ పోరాటాలకు ఆకర్షితురాలై చిన్ననాటి నుండే సమాజం పట్ల అవగాహన కలిగి భూస్వాములకు వ్యతిరేకంగా మాట్లాడి, తిరగబడే వారని, 1906 సంవత్సరంలో ఆమె వివాహం జరిగింది. ఆమెకు మొత్తం ఐదుగురు సంతానం, 1985 సెప్టెంబర్ 10వ తేదీన పాలకుర్తిలో మరణించారు. ఆనాడు నిజాం నవాబులు, దొరలు, భూస్వాములు చేసినటువంటి ఆగడాలకు, అకృత్యాలకు, ఎదురు తిరిగి పోరాడి నటువంటి వీర నారి చాకలి ఐలమ్మఅని, ఆమె చాకలి ఐలమ్మ పోరాటస్ఫూర్తితో భవిష్యత్ తరాలు ముందుకు రావాలని ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎడారి రమేష్, గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సోందే కుటుంబరావు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, ఏఐటీయూసీ కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, కార్యవర్గ సభ్యులు ఆధర్ల రాములు, బోశెట్టి సంపత్, రంగు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రిఫ్ ఇరిగేషన్ పంటల సాగుపై దృష్టి సారించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** డ్రిప్ ఇరిగేషన్ పంటల సాగు పై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉద్యానవన పాలేరు డివిజన్ అధికారిణి అపర్ణ సూచించారు. మండల కేంద్రంలో స్థానిక రైతు వేదిక లో గురువారం ఆత్మా ఆధ్వర్యంలో అవగాహణ మరియు శిక్షణ ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉద్యానవన పంటల పై రైతులకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులలో నీటి తక్కువ వినియోగం పంటలను సాగు చేయాలని సూచించారు. పంటల సాగులో మెళుకువలు, చీడపీడల నివారణ చర్యలు, అధిక దిగుబడులు సాదించేందుకు సూచనలు పాటించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వైపు ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుత, పరిస్థితులలో పప్పు దినుసులు సాగు చేయాలని అన్నారు. ఉద్యానవన శాఖలో అందుబాటులో ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్పామ్, కూరగాయాల సాగు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. పలు అంశాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈవో లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 16 నుంచి సీనియర్స్ టెన్నిస్ టోర్నమెంట్



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటిసారిగా ఈ నెల 16 నుండి 22వ, తేదీ వరకు ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుండి సుమారు 3 నుండి నాలుగు వందల మంది క్రీడాకారులు పాల్గొననున్నారని తెలిపారు. పాల్వంచ శ్రీనివాసకాలనీ మినీ స్టేడియం, కేటిపిఎస్ కాంప్లెక్స్, నవభారత్ కాలని, కొత్తగూడెం ప్రగతి మైదానంలో 35+,45+,55+,65+,70+,75 విభాగాలలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వటం తో జిల్లాకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపురానుందని స్పష్టం చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే పోటీలకు క్రీడాకారులు, క్రీడాభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెన్నిస్ అసోసియేషన్ జిల్లా సెక్రటరి జాకరయ్య, వైస్ ప్రసిడెంట్ వై. వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరి అన్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు ఘన నివాళి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని మొండికుంట గ్రామ పంచాయితీలో గురువారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మర్రి సంధ్య ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని సంధ్య అన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన ధైర్యం సాహసాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు మేవా ఆర్థికసాయం





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బూర్గంపాడు మండల కేంద్రానికి చెందిన ఇద్దరికి సారపాకకు చెందిన ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్(మేవా)రూ 10వేల ఆర్థిక సాయం అందించింది. గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న బీయమ్మకు రూ 5వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఆటో డ్రైవర్ జానీకి రూ 5వేలు అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే తమ సంస్థ లక్ష్యమని మేవా ప్రతినిధులు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్ద షేక్ దస్తగిరి, మేవా అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా, సోహెల్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## 11న మహాధర్నాను విజయవంతం చేయండి





**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** నిత్యావసర ధరలు పెంచి ప్రజలపై భారాన్ని మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు సాయన్న, సున్నం వీరభద్రం అన్నారు. దుమ్ముగూడెం మండలం మొలకపాడులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 11న కొత్తగూడెంలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఇసుక లారీ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షా శిబిరాలు ఏర్పాటు చేయాలని, పాడైన రహదారిని తొలగించి కొత్తగా నిర్మించాలని డిమాండ్ చేశారు. పోడు పంటల ధ్వంసం నిలిపివేయడం, సర్వే పూర్తయిన భూములకు పట్టాలు ఇవ్వడం, అన్యాక్రాంత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచడం, గిరిజన చట్టాల ఉల్లంఘనకు పాల్పడే అధికారులపై చర్యలు, పెండింగ్ ఇందిరమ్మ బిల్లుల విడుదల, అర్హులకు ఎస్టీ ధ్రువపత్రాలు ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు మిడియం ముదరాజు, కోరస రాంశెట్టి, చింతకాయల సరళ, కొమరం బాబు, కొమరం వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 21న భద్రాచలం ఐటీడీఏ ముట్టడి



**ప్రజాపక్షం/గుండాల:** ఆదివాసీ హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 21న భద్రాచలం ఐటీడీఏ వద్ద నిర్వహించనున్న ఆదివాసీ మార్చ్‌ను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపరి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. గుండాల మండలంలో పగిడిద్ద రాజు, సమ్మక్క, సారలమ్మ, నాగులమ్మ తల్లులకు పూజలు నిర్వహించి మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆదివాసీ హక్కుల కోసం చేపట్టే ఈ పోరాటానికి ప్రజలు, యువత, విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. పగిడిద్దరాజు స్ఫూర్తి, సమ్మక్క, సారలమ్మల వీరత్వం, నాగులమ్మ తల్లి ఆశీర్వాదం ఆదివాసీ హక్కుల పోరాటానికి నూతన స్ఫూర్తినిస్తాయని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకట నారాయణ, ఆదివాసీ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఊకే రామకృష్ణ, కల్తీ శేఖర్, మోకాళ్ల వీరాస్వామి, సందీప్, రామారావు, గుండాల గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

## రైల్వే గేటు సమస్య పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం భాగ్యనగర్ తండా, పరిసర ఐదు తండాల ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే రాకపోకల సమస్యను పరిష్కరించాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందించారు. గిరిజన రైతుల పోడు పట్టాలు, హక్కుల సమస్యలను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైతులు, కూలీలు ప్రతి రోజూ రైల్వే ట్రాక్ దాటి పొలాలకు వెళ్లాల్సి వస్తోందని, అనుమతి లేకుండా ట్రాక్ దాటితే కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జరుపుల బాలాజీ చేను సమీపంలోని కేఎస్/5/5రైల్వే స్తంభం వద్ద అండర్‌పాస్ లేదా రైల్వే గేటు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యను రైల్వే అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని జాటోత్ హుస్సేన్ నాయక్ హామీ ఇచ్చినట్లు హర్ష నాయక్ తెలిపారు.

# ఐలమ్మ పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణలో చిట్యాల ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరాకు స్ఫూర్తిదాయకమని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ నాటి నిజాం ప్రభుత్వంలో దొరలు, జమీందార్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను తీవ్రంగా హింసించే వారని ఆయన తెలిపారు. భూములపై పెత్తనాన్ని కొనసాగిస్తూ పేదలను కేవలం శ్రమ చేసేందుకు మాత్రమే పుట్టారు అన్నట్లుగా వ్యవహరించారని ఈ సదర్భంలో ఐలమ్మ సాహసోపేత పోరాటం సాగించి తన భూమిని రక్షించుకుందన్నారు. ఇటువంటి పోరాటం ఆనాడు తెలంగాణలో అనేక మందిలో పోరాట జ్వాల రగిలించిందని సురేష్ తెలిపారు. ఐలమ్మ నాడు సాగించిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని సురేష్ తెలిపారు. పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. ఒక పక్క నిరుద్యోగం, మరో పక్క ద్రవ్యోల్బణం, అవినీతి ఈ దేశానికి అత్యంత ప్రమాదకరంగా మారాయని ఆయన తెలిపారు. ప్రజా ఉద్యమాల నిర్మాణమే ఐలమ్మకు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, పావులూరి మల్లికార్జున్, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల, గాదె లక్ష్మినారాయణ, పేరబోయిన మోహన్‌రావు, పోటు పూర్ణచందర్‌రావు, సిపిఐ కార్యాలయ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ క్విజ్ పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 2047 నాటికి సంపూర్ణ అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని మై భారత్ కేంద్ర జిల్లా యువజన అధికారి ఎం. వెంకటరాంబాబు తెలిపారు. యువతలో విన్నూత ఆలోచనలను వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ 2027 ఆన్‌లైన్ క్విజ్ పోటీలను ప్రారంభించిందన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వెంకటరాంబాబు మాట్లాడుతూ భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు గల యువతీ, యువకులు పాల్గొనవచ్చునని తెలిపారు. తెలుగుతో సహా 22 అధికారిక భాషల్లో ఈ ఆన్‌లైన్ క్విజ్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. మొత్తం ఐదు దశల్లో ఎంపిక ప్రక్రియ సాగుతుందని ఆన్‌లైన్ క్విజ్ వ్యాసరచన పోటీ, జిల్లా స్థాయి రౌండ్, రాష్ట్ర స్థాయి రౌండ్, జాతీయ స్థాయి రౌండ్ ఉంటుందన్నారు. ఈ దశలను విజయవంతంగా పూర్తి చేసుకుని తుది విజేతలుగా నిలిచిన యువతకు న్యూఢిల్లీలో జరిగే సదస్సులో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో దేశాభివృద్ధికి సంబంధించిన తమ సరికొత్త ఆలోచనలను స్వయంగా వివరించే అవకాశం దక్కుతుందన్నారు. ఆసక్తి గల జిల్లాలోని యువతీ, యువకులు, విద్యార్థులు ఈనెల 30 లోపు my bharat.gov.in వెబ్ సైట్‌ను సందర్శించి ఉచితంగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ బానోత్ రెడ్డి, అకౌంట్ ఆఫీసర్ కె. భానుచందర్, అసిస్టెంట్ ప్రోఫెసర్ డా॥ చరిత్ర, జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ ఫారూఖ్ ఇమ్రాన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూముల సమస్యలు పరిష్కరిస్తాం

**-సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఐటిడిఏ ఏజెన్సీ పరిధిలోని గిరిజన రైతుల పోడు భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఐటిడిఏ సహయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తెలిపారు. గిరిజన రైతులకు పోడు పట్టాలతో పాటు పంట పొలాల్లో బోర్‌వెల్స్, విద్యుత్ సౌకర్యానికి కృషి చేస్తామన్నారు.గురువారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజన రైతులకు పోడు భూముల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గిరిజన దర్బార్ నిర్వహించారు. గిరిజన దర్బార్‌లో పలువురు రైతులు వారి భూములకు సంబంధించిన వివరాలు, పోడు పట్టాలు, విద్యుత్ సౌకర్యం, బోర్‌వెల్స్ తవ్వుకోవడానికి అనుమతి, కొత్తగా పోడు కొట్టుకున్న భూములకు పట్టాలు ఇవ్వాలని అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా ఏపివో జనరల్ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ భద్రాచలం ఐటిడిఏ పివో బి. రాహుల్ ఆదేశాల మేరకు రఘునాథపాలెం మండలంలో పోడు భూముల సమస్యలు అధికంగా ఉన్నాయని రైతులు పివో దృష్టికి తీసుకు వచ్చినందున ప్రత్యేక గిరిజన దర్బార్ నిర్వహించడం జరిగిందన్నారు.పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజన రైతులు కొత్తగా ఎవరు పోడు కొట్టకూడదన్నారు. గతంలో ప్రభుత్వం అందించిన భూముల్లో మాత్రమే పోడు వ్యవసాయం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం పోడు వ్యవసాయం చేసుకుంటున్న భూముల్లో అటవీశాఖ అధికారులు సమస్యలు ఏమి సృష్టించరని కొత్తగా పోడు కొడితే అడ్డుకుంటారన్నారు. బోర్‌వెల్స్ నిర్మాణం కొరకు 295 మంది, విద్యుత్ కనెక్షన్ కొరకు 21 మంది, కొత్తగా పోడు పట్టాల కొరకు 12 మంది, రైతు భరోసా రుణం కొరకు ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రైతులు అందించిన దరఖాస్తులను ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, పివిటిజి అధికారి గన్యానాయక్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

# లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, షూస్ పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా జిఈటి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, వరలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా గురువారం 20వ వార్డులోని శాంతినగర్ ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ పుస్తకాలు, షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కేక్ కట్ చేయించి, శ్యామ్‌బాబు, వరలక్ష్మి దంపతులకు లయన్స్ క్లబ్ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. లయన్స్‌క్లబ్ ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి లయన్ మెంబర్ తమ పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం వంటి ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాలతో నిర్వహించాలని సూచించారు. వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పుస్తకాలు, షూస్ అందజేసిన శ్యామ్‌బాబు, వరలక్ష్మి దంపతులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎల్‌సిఐఎఫ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్‌రావు, రీజన్ చైర్మన్ నూకల శ్రీనివాసరావు, జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేంద్రరావు, జోన్ చైర్మన్ తోటకూర శ్రీకాంత్, రీజియన్ సెక్రటరీ వై.బుచ్చిరామారావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కొల్లా రాంబాబు, కార్యదర్శి కొదుమూరి రవి, వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి శ్రీనివాసరావు, సభ్యులు మరికంటి రాంగోపాల్, దాస్, సంగిశెట్టి వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయురాలు కరుణశ్రీ, బీక్యా, సేవాలాల్ అధ్యక్షుడు నర్సింహానాయక్, జిల్లా కమిటీ సభ్యులు నూకల ప్రసాదరావు, చింతోజు నాగేశ్వరరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటియుసిలో పలువురు కార్మికులు చేరిక



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సిపిఐ అనుబంధ ఏఐటియుసిలో పలువురు కార్మికులు చేరారు. గురువారం మండల పరిధిలోని బావోజీ తండాలో జరిగిన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటియుసి)లో సుతారీ మేస్త్రీలు, కూలీలు 70 మంది చేరారు. వారికి ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె లక్ష్మినారాయణ, జిపి వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య లు పార్టీ కండువలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం, హక్కుల రక్షణకు ఏఐటియుసి నిరంతరం పోరాడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నిధులను వారి సంక్షేమానికి కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలన్నారు. బానోత్ రామ్మూర్తి ఆధ్వర్యంలో బానోత్ మోహన్, లకావత్ కృష్ణ, తేజావత్ మహేందర్, తేజావత్ లాలు తదితరులు ఏఐటియుసిలో చేరారు. ఈ కార్యక్రమంలో జిపి వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) నాయకులు గుగులోత్ రాందాస్, బానోత్ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన సహకార సంఘాలతోనే వ్యవసాయ అభివృద్ధి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్రంలో స్థిరమైన వ్యవసాయ ఆహార వ్యవస్థల నిర్మాణానికి విత్తన సహకార సంఘాలను బలోపేతం చేయడం అత్యంత ఆవశ్యకమని వ్యవసాయ, సహకార రంగ నిపుణులు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, పిఏసిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నాబార్డ్ ఆర్థిక సహకారంతో గురువారం డిసిసిబి కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిజెటిఏయు విత్తన విభాగ డైరెక్టర్ డా॥ నగేష్‌కుమార్, డిసిసిబి సిఈవో ఎన్. వెంకట ఆదిత్య లు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు విత్తనోత్పత్తిలో చురుగ్గా పాల్గొని రైతులకు నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలను సకాలంలో అందించాలని సూచించారు. విత్తన సాంకేతిక నిపుణులు డా॥ విద్యాదర్, విత్తన ధృవీకరణ అధికారి వేణు నాణ్యతా ప్రమాణాలు ధృవీకరణ విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి గంగాధర్, శ్రీనివాసరావు, శ్రీరామ్, సుజిత్‌కుమార్, కెవికె శాస్త్రవేత్తలు డా॥ టి. భరత్, డా॥ పావని, డా॥ రాములమ్మ, డా॥ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# పోషణ సేవలను బలోపేతం చేయాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పోషణ సేవలను మరింత బలోపేతం చేయడంలో కుటుంబాలు, సమాజం చురుగ్గా భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు. గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మన అంగన్‌వాడీ మన బాధ్యత పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ తొమ్మిది నుంచి అక్టోబర్ ఎనిమిది వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా జాతీయ పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం,ఆరోగ్యం, పరిశుభ్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. స్థానిక ప్రజలు స్వయం సహాయక సంఘాలను అంగన్‌వాడీ కేంద్రాలకు అనుసంధించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, డిపివో వినోద్‌కుమార్, అధికారులు కె. బాబు, శ్రీనివాస్, సమీర్ పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తి దాయకం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాటం స్ఫూర్తిదాయకమని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి తెలిపారు. ఖమ్మం వైరా రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ అసమానత్వానికి ఎదురొడ్డి నిర్భయంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు. జమీందార్ల పాలనలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఆమె పోరాడారన్నారు.ఈ కార్యక్రమంలో రజక కుల సంఘ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మకు ఘన నివాళి



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వైరా పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. పట్టణ రజక సంఘం అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మున్సిపాలిటీ సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అణగారిన ప్రజల హక్కుల కోసం, భూస్వాముల దోపిడికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడాలని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి, ఆత్మ గౌరవం నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఐలమ్మ త్యాగాలను స్మరించుకుంటూ ఆమె ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అనాయకులు సంగెపు వెంకన్న, గడసందుల పెద్ద దర్గయ్య, ఏదునూరి శ్రీను(బుజ్జి), రేగళ్ల వీరభద్రం, గరిడేపల్లి నారాయణ, లాలయ్య, రేమల్ల కోటేశ్వరరావు, బాసటి రామారావు, ఏదునూరి నర్సింహారావు, గరిడేపల్లి కిషోర్, రేమల్ల రాము, ఏదునూరి రాము, మంకెన ఉపేందర్, తాళ్లూరి నవీన్, ఏదునూరి సురేష్, తమ్మారపు శ్రీకాంత్, జోగినపల్లి నవీన్, ఏదునూరి నాని, ఏదునూరి చక్రి తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత టివిఆర్ చంద్రం



**- పుస్తకావిష్కరణ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**

ప్రజాపక్షం/భద్రాచలం : ఏజెన్సీ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి టివిఆర్ చంద్రం చేసిన కృషి చిరస్మరణీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా ఉన్నారు. టివిఆర్ చంద్రం 20వ వర్ధంతి సందర్భంగా స్థానిక కేకే ఫంక్షన్ హాల్లో ఎగరేసిన ఎర్రజెండా పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పాషా మాట్లాడుతూ ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో టివిఆర్ చంద్రం చేసిన పోరాటాలు నేటికి చిరస్మరణీయం అన్నారు. కమ్యూనిస్టు పార్టీ చీలిపోయిన తర్వాత ఈ ప్రాంతంలో గిరిజనులు, కార్మికులు బలహీన సబ్బండ వర్గాల ప్రజల మేలు కోసం ఆయన నిర్మించిన పోరాటాలు కమ్యూనిస్టు ఉద్యమానికి మైలురాయిగా మిగిలాయని చెప్పారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ప్రజాపోరాటల చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని, ఇది ముందు తరానికి స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందని చెప్పారు. ప్రజలకష్టాలను స్వయంగా తెలుసుకుని వారిని సమీకరించి ఉద్యమాలు నిర్మించారని, ప్రతికూల పరిస్థితుల్లోనూ కమ్యూనిస్టు ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన చేసిన కృషి ప్రత్యేకమైందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా పేదలు గిరిజనులు కార్మిక సమస్యలపై ఐక్యంగా ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. టివిఆర్ చంద్రం చూపిన ప్రజా ఉద్యమ పోరాటాన్ని నేటి తరం కొనసాగించడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని షాబీర్ పాషా పేర్కొన్నారు. సిపిఐ ఖమ్మం జిల్లాకార్యవర్గ సభ్యులు శింగు నర్సింహా రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం నాయకులు బి వెంకట్ బండారు రవికుమార్ ఎలమంచిలి రవికుమార్ మచ్చా వెంకటేశ్వర్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం : కలెక్టర్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి భుక్తి కోసం ధైర్యంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ మహిళా శక్తికి సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచారని కలెక్టర్ అంకిత్ అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఐడిఓసి సమావేశ మందిరంలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం అన్నారు. యువత మహిళలు ఆమె ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమానత్వం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల డిఆర్వో పద్మావతి బిసి సంఘాల నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరా ప్రియదర్శినికి కాళోజీ నంది అవార్డు



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : జిల్లా న్యాయవాద రంగానికి మరో విశిష్ట గౌరవం దక్కింది. జిల్లా కోర్టు పరిధిలో ప్రతిభ కనబరిచిన కొత్తగూడెం పట్టణం ప్యూన్ బస్తీకి చెందిన అడ్వకేట్ ఇందిరా ప్రియదర్శిని బెస్ట్ జూనియర్ అడ్వకేట్‌గా ఎంపికయ్యారు. దీనితో పాటు కాళోజీ జయంతి సందర్భంగా ప్రదానం చేసిన ప్రతిష్ఠాత్మక కాళోజీ నంది అవార్డును సైతం ఆమె దక్కించుకున్నారు. వరంగల్‌లోని కాళోజీ ఆడిటోరియంలో బుధవారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక సభలో హై కోర్టు న్యాయమూర్తి చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. న్యాయవృత్తిలో ఆమె చూపుతున్న నిబద్ధత అంకితభావానికి రాష్ట్రస్థాయి గుర్తింపు లంభించడం పట్ల జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పలువురు న్యాయవాదులు పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అదిరోహించాలని ఆకాంక్షించారు.

# క్రీడా ప్రతిభే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

**-మండల స్థాయి పోటీలు ప్రారంభించిన ఎంపీడీవో జమలారెడ్డి**



ప్రజాపక్షం/బూర్గంపాడు: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జమలారెడ్డి తెలిపారు. మోరంపల్లిబంజర్ ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ యెదు సింహరాజుతో కలిసి గురువారం పోటీలను ప్రారంభించారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని జమలారెడ్డి సూచించారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. గ్రామీణ విద్యార్థుల ప్రతిభను గుర్తించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. క్రీడలతో ఏకాగ్రత, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని ఎంఈఓ యెదు సింహరాజు అన్నారు. ఈనెల 10,11తేదీల్లో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, పరుగు, లాంగ్‌జంప్, హైజంప్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతిభ కనబరిచిన వారిని తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బొర్రా సుభద్ర, ఉప సర్పంచ్ పొక్కుల రవి, రామచంద్రారెడ్డి, ఆదర్శరెడ్డి, పీఈటీలు కృష్ణ, బాబురావు, పూర్ణ, సుకన్య, నాగలక్ష్మి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భక్తి, బాధ్యత, భద్రతతో గణేష్ ఉత్సవాలు



ప్రజాపక్షం/ఇల్లందు: గణేష్ ఉత్సవాలను భక్తి, బాధ్యత, భద్రత అనే మూడు సూత్రాలతో ప్రశాంతంగా నిర్వహించాలని ఇల్లందు డీఎస్పీ యు వెంకన్న బాబు, సీఐ బి సత్యనారాయణ సూచించారు. ..ంచారు, బోడు, ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులకు గురువారం అవగాహన కల్పించారు. మతసామరస్యానికి భంగం కలగకుండా, అధిక శబ్దానికి తావు వ్వకుండా ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. ఊరేగింపులు, నిమజ్జనాలను నిర్ణీత మార్గాలు, సమయాల్లోనే చేపట్టాలని, పోలీస్, రెవెన్యూ, పంచాయితీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద వాలంటీర్లు, క్యూలైన్లు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యుత్ వైరింగ్, జనరేటర్లను సురక్షితంగా ఏర్పాటు చేయడంతో పాటు అగ్నిమాపక పరికరాలు, అత్యవసర మార్గాలు, సీసీ కెమెరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే తాకకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నిమజ్జన సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించి మద్యం సేవించి వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



ప్రజాపక్షం/మణుగూరు: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 40 వ వర్ధంతి సందర్భంగా మణుగూరు పట్టణంలోని సిటిప్ రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ విగ్రహానికి బుధవారం రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం కుల పెద్దలు, నాయకులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం , పెద్దలు, పున్నం బిక్షపతి, రాపర్తి శ్రీహరి వల్లంకొండ అప్పయ్య, ఘంటసాల శ్రీను యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



ప్రజాపక్షం/గుండాల: మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రజక, ఆదివాసీ, యువజన సంఘాల నాయకులు ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, భూమి, భుక్తి కోసం ఆమె సాగించిన పోరాటాన్ని కొనియాడారు. భూస్వాములు, పెత్తందారుల ఆధిపత్యానికి ఎదురొడ్డి పీడిత ప్రజల విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. గుండాల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో తొలిసారిగా వర్ధంతి నిర్వహించడం విశేషమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రజక సంఘం నాయకులు గడ్డం లాలయ్య, వీరన్న, రమేష్, మోహన్, నాగేశ్వరరావు, నారాయణ, రవి, రాజేష్, గామాలపాటి లక్ష్మీ నారాయణ, గడ్డం సత్యం, ఆదివాసీ పరిషత్ జిల్లా నాయకుడు వీసీ దొర, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు గోవింద నరసింహారావు, నవచైతన్య యూత్ అధ్యక్షుడు ఆజాద్, ఎమ్మార్పీఎస్ నాయకుడు గడ్డం సంపత్, నడిగొట్ల నరేష్, సాట్ల వినోద్, గామాలపాటి నవీన్, గడ్డం సుమంత్, గడ్డం పాపయ్య, గామాలపాటి రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రంలో సంఘం అధ్యక్షుడు బూరుగడ్డ రాములు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రంలో సంఘం అధ్యక్షుడు బూరుగడ్డ రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ వాసం సుస్మిత, ఉప సర్పంచ్ సయ్యద్ ఆరిఫ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మర్కోడులో రజక సంఘం ప్రధాన కార్యదర్శి ముప్పారపు రాము ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సుతారి రమాదేవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ పోరాటంలో ఐలమ్మ చూపిన వీరత్వం, త్యాగాలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆమె జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈకార్యక్రమాల్లో రజక సంఘం నాయకులు బూరుగడ్డ కృష్ణ, సత్యరాజ్, గడ్డం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ తెలుగు రచయితల మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/కూసుమంచి: మన భూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో 2027లో నిర్వహించనున్న జాతీయ తెలుగు రచయితల మహాసభల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణతో పాటు రచయితలను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. యువతలో తెలుగు భాషపై ఆసక్తి పెంచేలా మరిన్ని సాహిత్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 2027 జాతీయ మహాసభలకు కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సలహాదారు వార నాగేశ్వరరావు, కోశాధికారి చెరుకుపల్లి యశ్వంత్ పాల్గొన్నారు.

# బయోఫ్లాక్ సాగుపై మత్స్యరైతులకు శిక్షణ



ప్రజాపక్షం/కూసుమంచి: మత్స్య పరిశోధన స్థానం, పాలేరు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో తెలంగాణ మత్స్య రైతులు, మత్స్యకారులకు నిర్వహించిన బయోఫ్లాక్ విధానంలో చేపల సాగు మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ గురువారం ముగిసింది. ఖమ్మం, సూర్యపేట, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 25 మంది పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా యూనియన్ బ్యాంక్ పాలేరు మేనేజర్ కె వెంకట ఫణింద్రకుమార్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు బోధించిన బయోఫ్లాక్ సాగు మెలకువలను పాటిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డా జి విద్యాసాగర్‌రెడ్డి చేపల పట్టుబడి, మార్కెటింగ్, నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై వివరించారు. మత్స్య పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ఎం శ్యాం ప్రసాద్, మత్స్య శాస్త్రవేత్త పి శాంతన్న, యంగ్ ప్రొఫెషనల్ సిగ నాగరాజు బయోఫ్లాక్‌లో లాభదాయక సాగు, మేత యాజమాన్యం, వ్యాధుల నివారణ, ప్రభుత్వ సబ్సిడీ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

# అందుబాటులో ఆధార్ సేవా కేంద్రం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పట్టణంలోని ప్రజల సౌకర్యార్థం ఆధార్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. గురువారం పాతమెయిన్ హాస్పటల్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. కొత్త ఆధార్ నమోదు, వివరాల సేకరణ చిరునామా మార్పు మొబైల్ నెంబర్ అనుసంధానం తదితర సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. కేంద్రంలో రోజుకు 300 నుండి 400 మందికి సేవలు అందించే సామర్థ్యం ఉందని, ఆన్‌లైన్‌లో ముందస్తు టోకెన్ తీసుకునేందుకు వెసులుబాటు కల్పించామన్నారు. దీంతో ప్రజలు సమయం ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. సేవలు వేగంగా పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ప్రజాపక్షం/బూర్గంపాడు: పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు సాధ్యమని సర్పంచ్ భానోత్ నరసింహ అన్నారు. అంజనాపురం గ్రామంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో సీమంతం, అన్నప్రాసన వేడుకలు నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణీలు సమతుల ఆహారంతో పాటు ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు తీసుకోవాలని, గర్భధారణ సమయంలో టీకాలు తప్పని సరిగా వేయించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ స్వరాజ్యం, అంగన్‌వాడీ టీచర్ ఆర్ విజయలక్ష్మి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి , అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా, హెల్పర్లు పాల్గొన్నారు.

# యువకుని ఆత్మహత్య

ప్రజాపక్షం/భద్రాచలం : పట్టణంలోని జగదీష్ కాలనీకి చెందిన ప్రభాకర్ (25) అనే యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య ఒక పాప ఉన్నారు. మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే ద్వారా భూముల విస్తీర్ణంలో తేడాలు, రికార్డుల్లోని లోపాలు, హద్దుల వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. ఎర్రుపాలెం మండలంలోని తాటిగూడెం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. పంట పొలాల్లో నడుచుకుంటూ వెళ్లిన కలెక్టర్ రైతులు సమక్షంలో అధికారులు నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులతో నేరుగా మాట్లాడి సర్వే తీరుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ రీ సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక యంత్రాల సహాయంతో చేపడుతున్న భూ రీసర్వే ద్వారా ప్రతి రైతు భూమికి డిజిటల్ మ్యాప్‌తో కూడిన భూధార్ కార్డు అందుతుందని తెలిపారు. గతంలో కొంతమంది రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు లేకపోవడం, ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి తేడాలు ఉండడం వంటి సమస్యలు ఉన్నాయని చెప్పారు. కొందరి భూమి తక్కువగా, మరికొందరి భూమి ఎక్కువగా నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయని, రీసర్వే ద్వారా ఇలాంటి లోపాలను గుర్తించి సరిచేస్తామని స్పష్టం చేశారు. రీ సర్వేకు సంబంధించి రైతులకు 48గంటల ముందుగానే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. రైతుల సమక్షంలోనే భూములను కొలుస్తామని, రైతులు స్వయంగా తమ భూమి హద్దులను చూపించడంతో పాటు పక్క భూముల రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. సర్వేకు నోటీసులు అందుకున్న రైతులు, వారి కుటుంబంలోని భూ హక్కుదారులు, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు ఉన్న వారు తప్పనిసరిగా హాజరై పూర్తి వివరాలు అందించి అధికారులకు సహకరించాలని కోరారు. సర్వే పూర్తయిన వెంటనే భూమి విస్తీర్ణ వివరాలను రైతులకు అక్కడికక్కడే తెలియచేస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసిన తర్వాతే తుది వివరాలను నిర్ధారిస్తామని, అవసరమైతే రైతుల సమ్మతితో భూమి విస్తీర్ణానికి సంబంధించిన సంతకాలు కూడా తీసుకుంటామని చెప్పారు. రీ సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి గ్రామపంచాయతీ, తహశీల్దార్ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులపై ప్రదర్శిస్తామని తెలిపారు. అభ్యంతరాలకు నిర్ధిష్ట గడువు కల్పించి వాటిని స్వీకరించి పరిష్కరించిన అనంతరం తుది భూమి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. రీ సర్వే పూర్తయితే భవిష్యత్‌లో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు భూమిపై మరింత భద్రత కులుగుతుందని కలెక్టర్ దివాకర్ టిఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.సునీతాఎలిజబెత్, సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి, ఆర్ఐ రవికుమార్, సర్వేయర్ రాజశేఖర్, జిపిఓలు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రవి, బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటి సుధాకర్‌రెడ్డి, గౌర్రాఉ రాములు, కూడెల్లి నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



**ప్రజాపక్షం/మధిర:** చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మధిర పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి మధిర మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్‌కుమార్, పట్టణ కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూస్వామ్య, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మ గౌరవం కోసం ఆమె చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. మహిళలు, పేదలు, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చూపిన తెగువ నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నకిరికంటి రాజేశ్వరి, బోడిపూడి రేవతి, కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకులు రంగా హనుమంతరావు, నియోజకవర్గ యువజన కాంగ్రేస్ అధ్యక్షుడు తూమాటి నవీన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, సామినేని రామనాధం తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు.

# మధిర, ఎర్రుపాలెం మండలాలకు గోదావరి జలాలు



**ప్రజాపక్షం/మధిర:** మధిర, ఎర్రుపాలెం మండలాల రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని వర్షాభావ పరిస్థితుల నేపద్యంలో నాగార్జునసాగర్ ఆయకట్టులోని రెండో జోన్‌కు సాగునీరు అందించేలా డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు సాగర్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు విడుదల చేశారు. మధిర బ్రాంచ్ కెనాల్ ద్వారా మధిర మండలానికి, నిదానపురం మేజర్ ద్వారా మధిర, ఎర్రుపాలెం మండలాలకు సాగునీరు అందించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రోచ్చారణల మధ్య కాంగ్రేస్ పార్టీ నాయకులు వ్యవసాయ మార్కెట్ కమమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మధిర మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్‌కుమార్, కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకులు సూరంశెట్టి కిషోర్ గోదావరి జలాలకు స్వాగతం పలికారు. కొబ్బరికాయలు కొట్టి పూలతో గోదావరి జలాలను స్వాగతించారు. రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించి గోదావరి జలాలను మదిర, ఎర్రుపాలెం మండలాలకు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపిన భట్టివిక్రమార్కకు రైతులు, కాంగ్రేస్ పార్టీ నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రశాంత వాతావరణంలో నవరాత్రులు నిర్వహించాలి

**డీజేలకు అనుమతి లేదు : ఎస్సై జి నరేష్**




**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలంలో ఈ నెల 14 నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని చింతకాని ఎస్సై జి నరేష్ అన్నారు. విగ్రహాల ప్రతిష్టాపన మొదలు, నిమజ్జనం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గణపతి ఉత్సవాల నేపథ్యంలో మండలపాల నిర్వహణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై ప్రజాపక్షంతో ఆయన మాటలు...

### బలవంతపు చందాలు సరికాదు

నవరాత్రుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తే, పూర్తి వివరాలను సంబంధిత పోలీసు స్టేసన్లలో వివరాలను లిఖిత పూర్వకంగా అందించాలి. నిర్వహకుల నంబరు, కార్యక్రమాల అంశాలను వివరించాలి. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత ఎలాంటి మైకులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించొద్దు. అలాగే టపాసులు పేల్చడం వంటివి నిషేదం. జూదం, లక్కీడ్రాలు, బలవంతపు చందాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావివ్వొద్దు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.

### మండపాల వద్ద కాపలా తప్పనిసరి

గ్రామాల్లో గణేష్ మండపాల నిర్వహకులకు ముందస్తు అనుమతి తప్పని సరి. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. మండలపాల వద్ద ప్రమాదాలు జరగకుండా ఇసుక, నీరు, ప్రాథమిక అగ్నిమాపక పరికరాలను సిద్దంగా ఉంచుకోవాలి. పగలు, రాత్రి కనీసం ముగ్గురు వాలింటర్లు మండపాల వద్ద కాపలాగా ఉండాలి. పెద్ద మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది. అదేవిదంగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా మండపాలను ఏర్పాటు చేపుకోవాలి.

### వదంతులు నమ్మొద్దు

పూజల కోసం వెలిగించే దీపాలు, అగర్‌వత్తుల విషయంలో భక్తులు చాలా అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ వైరింగ్ పనులను నిపుణలైన ఎలక్ట్రీషియన్లతోనే చేయించాలి. తీగలు చిన్న పిల్లలకు అందే ఎత్తులో ఉండకుండా జాగ్రత్త పడాలి. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు నమ్మొద్దు . ఏవైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే 112 నంబరుకు సమాచారం అందించాలి.

### పోలీసులకు సహకరించాలి..

మద్యం తాగి మండపాల వద్ద ఉండకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులదే. ముఖ్యంగా ఉత్సవాలు, నిమజ్జనం రోజున నిర్వహించే శోభాయాత్ర సమయాల్లో డీజేలకు అనుమతి లేదు. నిమజ్జనం రోజున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నిర్వహకులు రూట్ మ్యాప్ పోలీసులకు అందించాలి. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించుకోవడానికి నిర్వాహకులు , భక్తులు పోలీసులకు సహకరించాలి.

# బాణాపురం బిడ్డకు డాక్టరేట్




**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని బాణాపురం గ్రామానికి చెందిన డాక్టర్ వి.వీరలక్ష్మి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ సాధించారు. విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కన్వొకేషన్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా కన్వొకేషన్ మెమో అందుకున్నారు. ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తూనే ఉన్నత విద్యను కొనసాగించి పీహెచ్‌డీ పూర్తి చేయడం వీరలక్ష్మి పట్టుదలకు నిదర్శనంగా నిలిచింది. విద్యారంగంలో సేవలందిస్తూ మరోవైపు పరిశోధనను కొనసాగించి డాక్టరేట్ సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. వీరలక్ష్మి తల్లిదండ్రులు వద్దేబోయిన భూషయ్య, వెంకమ్మ. ఆమె అన్న నాగేశ్వరరావు పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విద్యకు ప్రాధాన్యతనిస్తూ కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉన్నత విద్యలో ముందుకు సాగిన వీరలక్ష్మి సాధించిన ఈ ఘనత పట్ల కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టుదలతో ఉన్నత విద్యనభ్యసించి డాక్టరేట్ సాధించడం బాణాపురం గ్రామానికే గర్వ కారణమని పలువురు పేర్కొంటూ అభినందనలు తెలిపారు.

# ముత్తారంలో అర్ధరాత్రి చోరీ కలకలం

**- మాజీ ఎంపీటీసీ ఇంట్లో బంగారం, వెండి, నగదు అపహరణ**



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని ముత్తారం గ్రామంలోని మాజీ ఎంపీటీసీ కాలపొంగు శ్రీను ఇంట్లో బుధవారం అర్ధరాత్రి జరిగిన చోరీ కలకలం రేపింది. కుటుంబ సభ్యులు ఇంటి బయట వరండాలో నిద్రిస్తున్న సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనలో సుమారు 40తులాల వెండి, రెండు పుస్తెలు కలిపి 8గ్రాముల బంగారం, రూ.30వేలు నగదు అపహరణకు గురైనట్లు సమాచారం. చోరీ విషయాన్ని గుర్తించిన బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి, చోరీకి పాల్పడిన వ్యక్తుల ఆచూకీ కోసం ధర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంట్లోకి దుండగులు ఏ మార్గంలో ప్రవేశించారు? మరేదైనా వస్తువులు అపహరణకు గురయ్యాయా? అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

## తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/బోనకల్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఈ నెల 11న చిరునోములలో తామ్రపత్ర గ్రహీత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు రావెళ్ల జానకీ రామయ్య స్థూపం వద్ద తెలంగాణ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్కుల రామారావు పూలమాలలు వేసి వారోత్సవాలను ఘనంగా ప్రారంభించినున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాల్లో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, ఏఐకెఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కరరావు, శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్ధ శతాబ్దం అయినా చెదరని స్నేహం




**ప్రజాపక్షం/ ఖమ్మం :** అర్ధ శతాబ్దం తర్వాత అదే స్నేహం, అప్యాయతతో ఒకరినొకరు పలకరించుకుంటూ ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా అనాటి మధుర జ్ఞాపకాలను, కష్ట సుఖాల్లో ఒకరికొకరు అండగా నిలిచిన రోజులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఖమ్మంలోని లక్ష్మి గార్డెన్స్‌లో 1976 77 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్ధ శతాబ్దం తర్వాత ఒకరినొకరు ఎంతో ఆత్మీయంగా పలకరించుకుంటూ సంతోషంగా సరదాగా గడిపారు. ఈ లోకాన్ని విడిచిపెట్టిన తమ సహచరులను, వారి సేవలను, వారి స్నేహన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎస్ఐలు ఆర్. వెంకటనారాయణ, కె. నర్సింహారావు, పి. అప్పారావు, అబ్దుల్ గనీ, జి. కృష్ణారెడ్డి, విక్రమ సింహారావు, కె. వెంకట్రామిరెడ్డి, జి. పురుషోత్తం, వి. సత్తయ్య, సంపదయ్య, ఎంఎస్ఆర్ ఆచార్యులు, జి. సాయిరెడ్డి, ఎండి నూరుద్దీన్, కె. సోమేశ్వరరావు, కె. రామస్వామి, బి. సాంబశివరావు, కె. జయదేవ్‌రెడ్డి, వి. రవీంధర్, జి. వీరన్న, ఎస్. మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



**ప్రజాపక్షం/మధిర:** స్థానిక మధిర పట్టణంలో బుధవారం జరిగిన అకిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) మధిర మండల మహాసభల్లో నూతన మధిర మండల కౌన్సిల్ 30 మంది విద్యార్థులతో మండల శాఖను ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మ ణ్ ప్రకటించారు. మధిర మండల అధ్యక్షుడిగా నందిపాటి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా కళ్లెం అశోక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగానూతనంగా ఎన్నికైన ఏఐఎస్ఎఫ్ మధిర మండల అధ్యక్ష, కార్యదర్శులు నందిపాటి వెంకటేశ్వర్లు, కళ్లెం అశోక్ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని మండలవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ బలోపేతం చేస్తామని వారు తెలిపారు.